క్లుప్తంగా

శుభకార్యం

కూడేరు: మండల పరిధిలోని బ్రాహ్మణపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత రామచంద్రారెడ్డి సోదరి కుమారుడు శివానందరెడ్డి వివాహం నాగమణితో బుధవారం కూడేరులోని సాయి బాబా దేవాలయంలో జరిగింది. అలాగే కమ్మూరుకు చెందిన వైఎస్సార్‌సీపీ నేత చంద్ర శేఖర్‌రెడ్డి కుమారుడు శ్యాంసుందర్‌రెడ్డి వివాహం శిరీషాతో స్వగృహంలో జరిగింది. ఈ రెండు వివాహ కార్యక్రమాలకు ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వర రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

లీకేజీతో తాగునీరు వృథా



కూడేరు: పైపులైన్ లీకేజీ నుంచి తాగునీరు బయటకు వస్తున్న దృశ్యం

కూడేరు: మండల పరిధిలోని పి.నారాయణపు రానికి సీపీడబ్ల్యూఎస్ పథకం ద్వారా తాగు నీటిని సరఫరా చేస్తున్న పైపులైన్‌కు నాలుగు రోజుల క్రితం లీకేజీ ఏర్పడింది. దీంతో తాగునీరు వృథాగా పారుతోంది. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా స్పందించి లీకేజీకి మరమ్మతులు చేయించి తాగునీరు సక్రమంగా సరఫరా అయ్యేలా చూడాలని కోరుతున్నారు.

సబ్సిడీతో సమీకృత దాణా

కూడేరు: ప్రభుత్వం 60 శాతం సబ్సిడీతో సమీకృత దాణాని పశువులకు, గొర్రెలకు ఇవ్వనున్నట్లు మండల పశు వైద్యాధికారి శ్రీనివాసులు తెలిపారు. కేజీ దాణా రూ.16.50 కాగా సబ్సిడీతో కేజీ రూ.6.50 పైసలకే ఇస్తున్నట్లు చెప్పారు. ఒక్కో రైతుకి, పశువుల పెంపకందారునికి 1800 కేజీల వరకు సబ్సిడీతో సమీకృత దాణాని ఇస్తారన్నారు. కావాల్సిన వారు వెంటనే రైతు భరోసా కేంద్రాల్లో, పశు వైద్యశాలలో డబ్బు చెల్లించి దాణాని పొందవచ్చన్నారు.

పెళ్లి సామగ్రి అందజేత



పెళ్లి సామగ్రిని అందిస్తున్న రాళ్ల తిమ్మారెడ్డి

డి హీరేహాళ్(రాయదుర్గం): డి హీరేహాళ్ మండలం గొడిశెలపల్లిలో బుధవారం రెండు జంటలకు తాళిబొట్టు, పట్టువస్త్రాలు, ఇతర సామగ్రిని సచివాలయాల కన్వీనర్ రాళ్ల తిమ్మారెడ్డి దంపతులు వితరణ చేశారు. ఇప్పటికే 51 జంటలకు వస్తు, సామగ్రి సమకూర్చి మానవత్వం చాటుకున్నారు. ఈ సందర్భంగా రాళ్ల తిమ్మారెడ్డి మాట్లాడుతూ పెళ్లిళ్లు, ఇతర అవసరాల కోసం తమకు చేతనైన సాయం అందిస్తున్నామన్నారు.

పుస్తకాలను సద్వినియోగం చేసుకోండి

కూడేరు: గ్రంథాలయాల్లో ఉన్న విలువైన పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలని కూడేరు గ్రంథాలయాధికారిణి రాధారాణి విద్యార్థులకు సూచించారు. బుధవారం సమ్మర్ క్యాంపులో భాగంగా స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులకు పుస్తక పఠనంపై అవగాహన కల్పించారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక



ప్రణయ్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నేత బోయ సంగప్ప

కూడేరు: మండల పరిధిలోని జయపురానికి చెందిన టీడీపీ నేత బోయ సంగప్ప వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. బుధవారం అనంతపురంలోని ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వర రెడ్డి స్వగృహంలో విశ్వ తనయుడు వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జ్ ప్రణయ్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. ప్రణయ్‌రెడ్డి పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దేవా, నేతలు ఎర్రిస్వామి, దేవేంద్ర, ఆదినారాయణ, పెన్నోబులేసు, భాస్కర్ రెడ్డి,అక్కులన్న, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

వ్యాపారులతో సమావేశం



మాట్లాడుతున్న ఆర్టీసీ అధికారులు

కళ్యాణదుర్గం: స్థానిక ఆర్టీసీ డిపోలో బుధవారం నిర్వహించిన ప్రి బిడ్ మీటింగ్‌కు మంచి స్పందన లభించింది. డిపో మేనేజర్ రామచంద్ర ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి కడపకు చెందిన డిప్యూటీ సీటీఎం రమేష్, అనంతపురం డిప్యూటీ ఈఈ సురేంద్ర హాజరై మాట్లాడారు. కళ్యాణదుర్గం డిపో పరిధిలో ఉన్న ఖాళీ స్థలంపై ప్రభుత్వ నిబంధనలను వివరించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు వ్యాపార సముదాయాలను ఏర్పరుచుకునే వారికి మంచి అవకాశమన్నారు. అనంతరం సుమారు 10 మంది వ్యాపారస్తులకు బిడ్ విషయాలపై వివరించారు.

ఖరీఫ్ సాగుకు సన్నద్ధం

- అనుకూలిస్తున్న ముందస్తు వర్షాలు
- గతేడాది లక్ష్యానికి మించి సాగు
- ప్రణాళిక బద్ధంగా విత్తనాలు, ఎరువులు
- ఆర్‌బీకేల్లో పేర్ల నమోదుకు ఉత్తర్వులు



సేద్యం పనులు మొదలు పెట్టిన దృశ్యం

రాయదుర్గం: జిల్లాలో ముందస్తు వర్షాలు కురుస్తుండటంతో రైతన్నలు సాగుకు సన్నద్ధమవుతున్నారు. ముందస్తు ఖరీఫ్‌తో చీడపీడల నుంచి బయటపడొచ్చనే భావిస్తున్నారు. ఈ ఏడాది రాష్ట్రంలోకి ముందస్తు రుతుపవనాలు వచ్చే అవకాశం ఉందని వాతావరణ శాఖ ప్రకటించిన నేపథ్యంలో సేద్యపు పనుల్లో అన్నదాతలు నిమగ్నమయ్యారు. రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల పరిధిలో 3,02,420 హెక్టార్ల సాధారణ సాగు విస్తీర్ణం కాగా, గతేడాది రికార్డుస్థాయిలో 3,05,239 హెక్టార్లలో పంటలు సాగయ్యాయి. ఈ ఏడాదికి సాగు విస్తీర్ణం మరింత పెరిగే అవకాశం ఉందని వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు.

వేసవి దుక్కులతో ప్రయోజనం..

ఇటీవల జిల్లా వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో రైతన్నలు వేసవి దుక్కులు మొదలుపెట్టారు. పొలాల చదును, గట్ల మరమ్మతు, సేంద్రియ ఎరువులు వేయడం లాంటి పనుల్లో నిమగ్నమయ్యారు. వేసవిలో లోతు దుక్కులు చేపట్టడం వల్ల భూముల్లో సారవంతం పెరిగి ఆశించిన స్థాయిలో దిగుబడులు పెరిగే అవకాశం ఉంది.

రాయితీ విత్తనాలు సిద్ధం..

ప్రభుత్వం అందించే రాయితీ విత్తనాల పంపిణీకి అధికారులు సర్వం సిద్ధం చేశారు. గతేడాది లక్ష్యానికి మించి భూములు సాగులోకి రావడంతో ఈ ఏడాది దానికి తగ్గట్టుగానే విత్తనాలు, ఎరువులు సమకూర్చేలా ప్రణాళికలు చేపట్టారు. ఇప్పటికే మూడు నియోజకవర్గాల్లోనూ 50,500ల క్వింటాళ్లు మంజూరుకాగా, అవసరమైతే మరింత సమకూర్చేలా చర్యలు చేపట్టారు. క్వింటా వేరుశెనగ రూ.9,300 లు కాగా, అందులో ప్రభుత్వ రాయితీ రూ.3,720 కేటాయించారు. రైతు వాటాగా రూ. 5,580 చెల్లించాల్సి ఉంటుంది. బస్తాకైతే రూ.1,674 కట్టాలి. ఒక్కో రైతుకు గరిష్టంగా 3 ప్యాకెట్లు అందించనున్నట్లు రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ ఏడీఏ లు లక్ష్మానాయక్, యల్లప్ప, పద్మజ తెలిపారు.

త్వరలో పెట్టుబడి రాయితీ జమ..

వైఎస్సార్ రైతు భరోసా ద్వారా త్వరలో రైతు ఖాతాలకు పెట్టుబడి రాయితీ సొమ్మును రాష్ట్ర ప్రభుత్వం జమ చేయనుంది. గతేడాది 1,42,548 మంది రైతులకు రూ.78.41 కోట్లు జమైంది. ఈ ఏడాది రైతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది.

సాగు అంచనా, విత్తన కేటాయింపులు ఇలా..

నియోజకవర్గం	వేరుశనగ(క్వింటాళ్లలో)	సాధారణ సాగు(హెక్టార్లు)	గతేడాది సాగు
రాయదుర్గం	16,300	62,629	71,754
కళ్యాణదుర్గం	22,500	67,754	54,600
ఉరవకొండ	11,700	1,72,037	1,78,885

అర్హులైన ప్రతి రైతుకు రాయితీ విత్తనం



అర్హత కలిగిన ప్రతి రైతుకు రాయితీ విత్తనం అందేలా చర్యలు చేపట్టాం. ఇది రైతు పక్షపాత ప్రభుత్వం. వారికి ఏ అవసమో గుర్తించి అందించే బాధ్యత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకుంటున్నారు. టీడీపీ హయాంలో విత్తనాల కోసం రాత్రి, పగలు మండల కేంద్రాల్లో పడిగాపు కాయాల్సి వచ్చేది. ఇప్పుడు ఆర్బీకేల్లో రిజిస్ట్రేషన్ చేసుకుంటే గ్రామాల్లో విత్తన కాయ అందజేస్తున్నారు. మంచి నాయకుడు ఉండడంతోనే మంచి వర్షాలు కురుస్తున్నాయి.

– కాపు రామచంద్రారెడ్డి, ప్రభుత్వ విప్

రైతులకు ఇబ్బందులు రానీయం



రైతులకు ఏ ఇబ్బంది లేకుండా పటిష్ట చర్యలు చేపట్టాం. గతేడాది లక్ష్యానికి మించి పంటలు సాగులోకి రావడంతో ఈ ఏడాది కూడా దానికి తగ్గట్టుగానే విత్తనాలు, ఎరువులు సిద్ధం చేస్తున్నాం. పచ్చిరొట్టకు సంబంధించిన విత్తనాలు అందుబాటులోకి వచ్చాయి. ఆర్‌బీకేల్లో రైతులు రిజిస్ట్రేషన్ చేసుకుంటే ముందస్తుగా విత్తనకాయ అందేలా కృషి చేస్తాం.

– చంద్రానాయక్, డీఏఓ, అనంతపురం

15 నుంచి విత్తన వేరుశనగకు రిజిస్ట్రేషన్

కూడేరు: ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి సబ్సిడీతో అందించే విత్తన వేరుశనగ కోసం ఈ నెల 15 నుంచి రైతు భరోసా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఏఓ విజయకుమార్ బుధవారం తెలిపారు. మండలానికి 2,600 క్వింటాళ్ల వేరుశనగను కేటాయించడం జరిగిందన్నారు.

కళ్యాణదుర్గం: ఈనెల 15వ తేదీ నుంచి విత్తన వేరుశనగ పంపిణీ చేపట్టనున్నట్లు ఏడీఏ యల్లప్ప చెప్పారు. స్థానిక ఆర్‌బీకే కేంద్రంలో బుధవారం నియోజకవర్గంలోని ఐదు మండలాల ఆర్‌బీకే సిబ్బందితో సమావేశం నిర్వహించారు. నియోజకవర్గానికి 22,500 క్వింటాళ్ల వేరుశనగను కేటాయింపులు చేసినట్లు పేర్కొన్నారు.

విడపనకల్లు: 2023 ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగ విత్తనం సాగుచేసే రైతులకు రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీతో వేరుశనగ విత్తన కాయలను ఈనెల 15వ తేదీ నుంచి పంపిణీ చేస్తున్నట్లు ఏడీఏ పద్మజ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో ఆర్‌బీకేలో వ్యవసాయాధికారులు, సచివాలయ సిబ్బందికి వేరుశనగ విత్తనం పంపిణీపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. విడపనకల్లు మండలానికి 1000 క్వింటాళ్ల విత్తనం కేటాయించినట్లు ఏడీఏ తెలిపారు. నేటి నుంచే ఆర్‌బీకేలో వేరుశనగ విత్తన అవసరం ఉన్న రైతులు ముందుగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు.

రైతు విభాగం మండల కన్వీనర్‌గా నాయుడు



నాయుడు



జయశ్రీ

బొమ్మనహాళ్: వైఎస్సార్‌సీపీ రైతు విభాగం మండలకన్వీనర్‌గా నాయుడు, మహిళా విభాగం మండల కన్వీనర్‌గా జయశ్రీ నియమితులయ్యారు. ఈసందర్భంగా ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఈశ్వరరెడ్డి, సీనియర్ నేత చంద్రశేఖర్‌రెడ్డికి వారు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ కోసం నిరంతరం కృషి చేస్తామన్నారు.

వేమారెడ్డి మల్లమ్మ జీవితం ఆదర్శప్రాయం

- ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి

రాయదుర్గం: వేమారెడ్డి మల్లమ్మ జీవితం ఆదర్శ ప్రాయమని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. బుధవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో వేమారెడ్డి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి విప్ కాపుతో పాటు ఏపీఐఐసీ చైర్మన్ మెట్టు గోవిందరెడ్డి, రెడ్‌క్రాస్ సంస్థ జిల్లా చైర్‌పర్సన్ కాపు భారతి, రెడ్డి సంఘం తాలూక అధ్యక్షుడు గొని ఉపేంద్రారెడ్డి, గౌరవాధ్యక్షులు మాదవరెడ్డి, శంఖర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వేమారెడ్డి మల్లమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విప్, ఏపీఐఐసీ చైర్మన్ మాట్లాడారు. రెడ్డి కులంలో పుట్టిన మల్లమ్మ గొప్ప శివభక్తురాలిగా ఎదిగి ఆదర్శవంతమైన జీవితం గడిపిందన్నారు. శ్రీశైల మల్లన్న ఆలయం సమీపానే మల్లమ్మ ఆలయం కొలువుదీరిందన్నారు. గతంలో గ్రామాల్లో ఏ పుణ్యకార్యక్రమాలు చేపట్టినా మల్లమ్మ కథను ఆదర్శంగా తీసుకునే వారని గుర్తు చేశారు. తన భక్తితో సాక్షాత్తు శివుడినే ప్రత్యక్షం చేయించిన ఘనత మల్లమ్మదన్నారు. కార్యక్రమంలో ఆయా మండలాల రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షులు రాజగోపాల్‌రెడ్డి, నాగరాజురెడ్డి, లక్ష్మిరెడ్డితో పాటు బోర్‌వెల్ ఆనందరెడ్డి, శివారెడ్డి పాల్గొన్నారు.

ఆధ్యాత్మికత వైపు చిన్నారుల చూపు



మక్కా మసీదులో మక్తబ్ తరగతులకు హాజరైన చిన్నారులు

రాయదుర్గంటౌన్: సెలవుల్లో ముస్లిం చిన్నారులు తమ విలువైన సమయాన్ని వృథా చేసుకోకుండా ఆధ్యాత్మికత వైపు తమ దృష్టి సారించారు. నైతిక విలువలు, ఖురాన్, హదీస్‌కు సంబంధించిన చిన్నపాటి సూక్తులను నేర్చుకుంటున్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలు ఉత్తమ పౌరులుగా ఎదగాలని, పెద్దల పట్ల గౌరవం, ప్రవక్త మార్గాన్ని అనుసరించేందుకు దోహదపడుతుందని 'దీని మక్తబ్ ఇస్లామిక్ సమ్మర్ క్యాంపు'లకు పంపుతున్నారు. పట్టణంలోని మక్కా మసీదులో ముఫ్తి నూర్ మొహమ్మద్, ఉపాధ్యాయుడు ఉస్మాన్ ఆధ్వర్యంలో మక్తబ్ పేరిట 40 రోజుల పాటు సమ్మర్ క్యాంప్ నిర్వహిస్తున్నారు. అలాగే బీటీపీ రోడ్డులోని ఫాతిమా మసీదులో కూడా మక్తబ్ తరగతులు జరుగుతున్నాయి. 5 నుంచి 10 ఏళ్లలోపు వరకు చిన్నారులు హాజరవుతున్నారు. క్యాంప్ ప్రిన్సిపాల్ ముఫ్తి నూర్ మొహమ్మద్ మాట్లాడుతూ చిన్నారులకు నైతిక విలువలతోపాటు మంచి సంస్కారం, పెద్దల పట్ల గౌరవం, ప్రవక్త సూక్తులు, ఖురాన్‌లోని చిన్న చిన్న సూక్తులు, మంచి నడవడికపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.

మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట



షాదీమహల్ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్

కంబదూరు: ముస్లిం, మైనార్టీల సంక్షేమానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని రాష్ట్ర స్త్రీ,శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీచరణ్ అన్నారు. స్థానిక బీములకుంట రహదారిలో నూతనంగా నిర్మిస్తున్న షాదీమహల్ నిర్మాణానికి బుధవారం భూమిపూజ చేశారు. అలాగే షాదీమహల్ నిర్మాణానికి తన నిధుల నుంచి రూ.10 లక్షలు కేటాయిస్తామన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా ముస్లిం మైనార్టీల సంక్షేమాభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తున్నారన్నారు. మసీదుల నిర్మాణం, ఈద్గా గ్రౌండ్, శ్మశాన వాటిక కాంపౌండ్ వాల్ నిర్మాణాలకు ప్రత్యేక నిధులను కేటాయించి ముస్లింలకు అండగా నిలుస్తున్నారని కొనియాడారు. అనంతరం ముస్లిం మత పెద్దలు ప్రార్థనలు చేసి మంత్రిని దీవించారు. కార్యక్రమంలో ముస్లిం పెద్దలు బాషా, అల్లాబకాష్, షేక్షావలి, ఫయాజ్, ముజామిల్, దాదు, మహబూబ్‌సాబ్ తదితరులు పాల్గొన్నారు.

మండల మీట్‌లో టీడీపీ సభ్యుల ఓవరాక్షన్



సమావేశానికి అడ్డుతగులుతున్న టీడీపీ సభ్యులు

కణేకల్లు: మండల సర్వసభ్య సమావేశంలో టీడీపీ సభ్యుల ఓవరాక్షన్‌తో తోటి సభ్యులు, అధికారులు ఇబ్బందులు పడ్డారు. ప్రతి అంశంపై ఆ ఇద్దరు ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకోవడం, తమ ఊరికి ఏం చేశారంటూ అధికారులను టార్గెట్ చేస్తూ విమర్శించడం విసుగు తెప్పించింది. వైస్ ఎంపీపీ లీలావతి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. అధికారులు తమ పురోగతిపై చర్చిస్తుండగా ఎన్.హనుమాపురం సర్పంచు జయరాంచౌదరి, ఎంపీటీసీ నరేంద్ర అడుగడుగునా అడ్డుతగిలారు. నీవు మా ఊళ్లో పని చేయాలనుకుంటున్నావా లేదా అంటూ పంచాయతీ కార్యదర్శి శ్రీదేవిపై సర్పంచు ఆవేశంతో ఊగిపోవడంతో తాను పనిచేయనని ఎవరినైనా వేయించుకోమని ఆమె చెప్పారు. తహసీల్దార్ రజాక్ వలి, ఎంపీడీఓ శ్రీనివాసులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అందజేసే పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా చూడాలన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమంలో ప్రజలు తమ దృష్టికి తెచ్చిన సమస్యలను పరిష్కరించామన్నారు. ఈఓఆర్‌డీ గూడెన్న, ఏఓ శ్రవణ్‌కుమార్, డాక్టర్ కృష్ణవేణి, ఏపీఓ తిరుపాల్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

బొమ్మనహాళ్‌లో భారీ వర్షం



వర్షానికి తడిసిపోయిన వరి ధాన్యాన్ని ఆరబోస్తున్న రైతులు

బొమ్మనహాళ్: మండల కేంద్రం, ఉద్దేహాళ్, లింగదహాళ్, శ్రీధరఘట్ట, కృష్ణాపురం, కొలగానహళ్లి, ఏలంజి, మైలాపురం, ఉంతకల్లు, నేమకల్లు, బండూరు, గోవిందవాడ, దర్గాహొన్నూరు తదితర గ్రామాల్లో మంగళవారం రాత్రి ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. మండల వ్యాప్తంగా 43.2 మి.మీ వర్షంపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. వర్షానికి అక్కడక్కడ వరి పంట నేలకొరింది. పత్తి పంటలో వర్షపు నీరు చేరింది. రబీలో ముందుగా సాగు చేసిన వారు నూర్పిళ్లు పూర్తవడంతో ధాన్యాన్ని రోడ్డు, బయలు ప్రదేశాల్లో ఆరబెట్టుకున్నారు. ధాన్యం తడవకుండా పట్టలపై నిల్వ ఉన్న నీటిని తొలగించుకుంటున్నారు.

పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి



రైతులకు మందులు పంపిణీ చేస్తున్న దృశ్యం

కళ్యాణదుర్గం: పశు వైద్య శిబిరాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని కేవీకే రీసెర్చ్ సైంటిస్టులు డాక్టర్లు రాధాకుమారి, యుగంధర్, హరిణి అన్నారు. బోరంపల్లిలో బుధవారం కేవీకే ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పశువులకు వైద్య పరీక్షలు చేసి, మందులు అందజేశారు. పశువుల దాణాకు అవసరమైన మినరల్ బ్లాక్స్‌లు పంపిణీ చేశారు. వేసవిలో పశుసంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. వాటర్‌షెడ్ పీఓ శ్రీవిద్య, టీఓ శేషశయన, సోమశేఖర్ రెడ్డి, వాటర్‌షెడ్ కమిటీ చైర్మన్ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

గడప గడపకూ సంక్షేమం

- మంత్రి ఉషశ్రీచరణ్



లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందిస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్

కంబదూరు: గడప గడపకూ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని రాష్ట్ర స్త్రీ,శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీచరణ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని చెక్‌పోస్టు కాలనీ, వడ్డే కాలనీల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్లలో చేకూరిన సంక్షేమ లబ్ధిని వివరించారు. ఆయా కాలనీల్లో ప్రజలు విన్నవించిన సమస్యలను అక్కడికక్కడే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించేందుకు చర్యలు చేపట్టారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రభుత్వ పాలనను ప్రజల ముంగిటకు తెచ్చిన ఘనత సీఎం జగనన్నకు దక్కుతుందన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు ఎరువులు, విత్తనాలు అందిస్తూ, వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేస్తున్నారన్నారు. పొదుపు సంఘాల మహిళలకు ఇచ్చిన మాట ప్రకారం విడతల వారీగా రుణమాఫీ డబ్బులను వారి బ్యాంక్ ఖాతాలకే జమ చేస్తున్నట్లు చెప్పారు. 'మనబడి నాడు–నేడు' ద్వారా ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దుతున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు జగనన్న విద్యా కానుక ద్వారా పుస్తకాలు, యూనిఫాం, బూట్లు వంటి చదువుకునేందుకు అవసరమైన వస్తువులన్నీ ఉచితంగా అందజేస్తున్నట్లు చెప్పారు. ఆర్థిక ఇబ్బందులతో పేద విద్యార్థులు చదువుకు దూరం కాకూడదన్న ఉద్దేశంతో ఏటా అమ్మ ఒడి పథకం ద్వారా ఆర్థిక సహాయాన్ని అందిస్తూ చదువుకునేందుకు ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. ప్రజలకు మేలు చేస్తున్న జగనన్నను వచ్చే ఎన్నికల్లో ఆశీర్వదించి మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర జానపద, సృజనాత్మక అకాడమీ డైరెక్టర్ బాబురెడ్డి, బీసీ, రైతు విభాగాల జిల్లా ప్రధాన కార్యదర్శులు గోవింద్, నీలి శంకరప్ప, మండల కన్వీనర్ బాలరాజు యాదవ్, సచివాలయ మండల కన్వీనర్ సాకే గంగాధర్, వైస్ ఎంపీపీ భీమేష్, ఎంపీటీసీలు మీసేవ కుమార్, మల్లేష్, నాయకులు నూతిమడుగు రామ్మోహన్, కదిరిదేవరపల్లి హనుమంతరాయుడు, మల్లూరి వెంకటేశులు, వసంతరాయుడు, వెంకటప్ప, మాబూసాబ్, ఫయాజ్, దాదు, రామస్వామి, విల్సన్, రాజు, క్రాంతి, లోకేష్, ఒంటారెడ్డిపల్లి వెంకటేశులు, హనుమంతరాయుడు, బేల్దారి రామకృష్ణ, విద్యార్థి విభాగం నాయకుడు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం పంపిణీలో అలసత్వం వద్దు

కంబదూరు: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలకు అందించే పౌష్టికాహారాన్ని అందించడంతో అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీచరణ్ అంగన్‌వాడీ సిబ్బందిని హెచ్చరించారు. బుధవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలోని 8వ అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పౌష్టికాహారం, రికార్డులను పరిశీలించారు. కొన్ని కోడి గుడ్లు తగిన బరువు లేకపోవడం, మరికొన్ని పగిలిపోయి ఉండటం గమనించారు. వంట నూనె నిల్వలేకపోవడంతో ఆగ్రహించారు. ఎందుకు ఇలాంటి గుడ్లను తీసుకున్నారు? ఎందుకు వంట నూనె నిల్వలేదు? ఒకవేళ వంట నూనె ప్రభుత్వం నుంచి సరఫరా కాలేదా? రాకపోతే మీ పర్యవేక్షలకు ఎందుకు తెలియజేయలేదని ప్రశ్నించారు. సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు తేలడంతో సూపర్‌వైజర్, అంగన్‌వాడీ కార్యకర్తలకు మెమోలు జారీ చేశారు. సరైన కోడిగుడ్ల సరఫరా చేయని కాంట్రాక్టర్‌కు సంబంధించిన బిల్లులు నిలిపివేయాలని ఐసీడీఎస్ పీడీ బీఎస్ శ్రీదేవిని ఫోన్‌లో ఆదేశించారు. కేంద్రాలకు సరఫరా అయ్యే పౌష్టికాహారం మిగిలకూడదన్నారు. ఒకవేళ ఎవరైనా కేంద్రానికి రాకపోతే వారికి సంబంధించిన పౌష్టికాహారాన్ని ఇంటికి వెళ్లి అందజేయాలయని సూచించారు. విధి నిర్వాహణలో నిర్లక్ష్యంగా పని చేసే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పండ్ల తోటల పెంపకానికి దరఖాస్తుల ఆహ్వానం

బ్రహ్మసముద్రం: ఉపాధి హామీ పనులకు కూలీల హాజరు శాతం పెంచాలని ఎంపీడీఓ వెంకటనాయుడు సూచించారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యలయంలో ఉపాధి హామీ సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో పని అడిగిన ప్రతి కూలీకి పనులు కల్పించాలన్నారు. సకాలంలో బిల్లు మంజూరు అయ్యేలా చూడాలన్నారు. ప్రతి కూలీ కూడా రూ.272 కూలి పడేలా పనులు చేయించాల్సిన బాధ్యత ఉపాధి సిబ్బందిపై ఉందని తెలిపారు. 2023–24 సంవత్సరానికి సంబంధించి మండలంలో పండ్ల తోటల పెంపకంపై ఆసక్తి ఉన్న రైతుల నుంచి దరఖాస్తులు ఆహ్వానించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధి ఏపీఓ అప్పస్వామి నాయుడు, ఈసీ జయప్రకాష్ , టీఏలు లావణ్య , మంజునాథ్, పండరీష్ పాల్గొన్నారు.

సజావుగా పాలిసెట్

కళ్యాణదుర్గం: పాలిసెట్ పరీక్ష బుధవారం సజావుగా ముగిసింది. పట్టణంలోని ఐదు పరీక్ష కేంద్రాల్లో 1,565 మంది పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా 1,384 మంది హాజరయ్యారు. కాగా.. పరీక్షకు హాజరైన విద్యార్థులు, గైర్హాజరైన విద్యార్థుల సంఖ్యను తెలపడంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీధర్‌కుమార్ నిర్లక్ష్యంగా వ్యవహరించారు.